క్లుప్తంగా

రేపటి నుంచి ప్రత్యేక ఆధార్ నవీకరణ శిబిరాలు

కపిలేశ్వరపురం: ఆధార్ నవీకరణ కోసం మండలంలోని పలు గ్రామాల్లో ఈ నెల 20 నుంచి ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ కొండలరావు ఆదివారం తెలిపారు. 20, 21 తేదీల్లో తాతపూడి, పడమర ఖండ్రిక, కాలేరు గ్రామ సచివాలయాల్లోనూ, 22, 23తేదీల్లో కోరుమిల్లి -1, వడ్లమూరు, 24న కపిలేశ్వరపురం -2, కోరుమిల్లి -2, నేలటూరు, 22వ తేదీన తాతపూడి, 23న కపిలేశ్వరపురం -2 సచివాలయాల్లో శిబిరాలను నిర్వహించనున్నారు. డిజిటల్ అసిస్టెంట్లు ఇనుమర్తి వీరమల్లేశ్వరరావు, ఫణీంద్ర, కోరా దొరబాబు ఈ శిబిరాల్లో నవీకరణ చేస్తారు. నూతన ఆధార్ నమోదు, పేరు, చిరునామా, ఫొటో, వేలిముద్రలను నవీకరించుకునే సదుపాయాన్ని వినియోగించుకోవాలని ఎంపీడీఓ కొండలరావు తెలిపారు.

నేడు రాయవరంలో శ్రీవారి నక్షత్ర కల్యాణం

రాయవరం: స్థానిక శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో సోమవారం నక్షత్ర కల్యాణం నిర్వహించనున్నారు. స్థానిక వేంకటేశ్వర భక్త సంఘం ఆధ్వర్యంలో ప్రతి నెలా నిర్వహించే నక్షత్ర కల్యాణాల్లో భాగంగా శ్రీవారికి ఈ వేడుక నిర్వహిస్తున్నట్టు భక్త సంఘం ప్రతినిధులు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు నక్షత్ర కల్యాణంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని వారు విజ్ఞప్తి చేశారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి




మరమ్మతులకు గురైన పైపులైన్‌ను పరిశీలిస్తున్న నాయకులు

కాజులూరు: గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు సలాది వీరబాబు, జనసేన నాయకుడు అన్యం శ్రీరామచంద్రమూర్తి కోరారు. గ్రామంలోని తాళ్లరేవు రహదారిలో ఆంజనేయస్వామి గుడి సమీపంలో మంచినీటి పైపులైను పగిలిపోయి రెండు నెలలుగా తాగునీరు వృథా పోతోంది. దీనిపై స్థానికుల ఫిర్యాదు మేరకు ఆదివారం సలాది వీరబాబు, అన్యం శ్రీరామచంద్రమూర్తి తదితరులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వీరబాబు మాట్లాడుతూ కేంద్రం నుంచి పంచాయతీలకు రూ.లక్షల్లో నిధులు విడుదలవుతున్నా కనీసం మంచినీళ్ల కుడా సక్రమంగా ఇవ్వలేకపోవటం దారుణమన్నారు. తక్షణమే అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

రైల్వే రిజర్వేషన్ కౌంటర్ పునరుద్ధరించాలి

కొత్తపేట: జిల్లా కేంద్రమైన అమలాపురంలో రైల్వే రిజర్వేషన్ కౌంటర్‌ను పునరుద్ధరించాలని పలువురు కోనసీమ వాసులు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆమేరకు కొత్తపేటకు చెందిన ఆర్యవైశ్య సంఘం, వర్తక సంఘం నాయకుడు తమ్మన సాయిప్రసాద్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేసి ఎంపీ గంటి హరీష్‌మాధుర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఎంతో కాలం క్రితమే అమలాపురం పట్టణంలో ఒక రైల్వే రిజర్వేషన్ కౌంటర్ ఉండేదన్నారు. ఈ ప్రాంత ప్రయాణికులు ఎంతో సులువుగా రైల్వే ప్రయాణాలకు ఆ కౌంటర్‌ను వినియోగించుకున్నారని పేర్కొన్నారు. సుమారు రెండేళ్ల క్రితం ఆ కౌంటర్‌ను తొలగించి, హెడ్ పోస్టాఫీస్‌కు మార్చారని సాయిప్రసాద్ గుర్తు చేశారు. దాంతో సేవలు పరిమితం కావడం, సెలవు దినాల్లో రిజర్వేషన్ సౌకర్యం లేకపోవడంతో రైల్వే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. టిక్కెట్ల సమాచారం, టిక్కెట్లు రద్దు చేసుకోవాలన్నా రాజమహేంద్రవరం వెళ్లాల్సి వస్తోందన్నారు. ఈ ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని, రైల్వే ప్రయాణికుల సౌకర్యార్థం తిరిగి రిజర్వేషన్ కౌంటర్ ఏర్పాటుకు ఎంపీ హరీష్‌తో పాటు జిల్లా మంత్రి వాసంశెట్టి సుభాష్, కోనసీమ ఎమ్మెల్యేలు కృషి చేయాలని కోరారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



అడబాల సత్యనారాయణ (ఫైల్)

ఆలమూరు: చొప్పెల్ల వద్ద 216 ఏ రహదారిపై కొండాలమ్మ వారి ఆలయం వద్ద జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ అడబాల సత్యనారాయణ (45) చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆలమూరు ఎస్సై ఎం.అశోక్ కథనం ప్రకారం ఈనెల 17న ఇటుక లోడుతో వెళుతున్న వ్యాన్ లారీ రోడ్డుపై రెండు ద్విచక్ర వాహనాలపై ప్రయాణిస్తున్న ముగ్గురిని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సత్యనారాయణ పరిస్థితి విషమించడంతో తొలుత రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్లారు. పరిస్థితి విషమించడంతో కాకినాడ ఆస్పత్రికి తీసుకువెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈమేరకు ఎస్సై అశోక్ కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వసతులు నిల్.. నిర్లక్ష్యం ఫుల్

- టిడ్కో గృహాల వద్ద సౌకర్యాల కల్పనలో అధికారుల నిర్లక్ష్యం
- వృథాగా జిమ్, పార్కుల సామగ్రి
- పట్టించుకోని అర్బన్ గ్రీనరీ శాఖ



టిడ్కోప్లాట్‌ల వద్ద వృథాగా పడి ఉన్న పార్కు, జిమ్ సామగ్రి

రామచంద్రపురం: ప్రభుత్వం ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నా అధికారుల అలసత్వం కారణంగా ప్రజాధనం వృథా కావడంతో పాటుగా ప్రభుత్వ లక్ష్యం నీరుకారుతోంది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న టిడ్కో నిర్మాణాల వద్ద సౌకర్యాల కల్పనలో కొన్ని శాఖల అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఇందుకు పట్టణంలోని అర్బన్ గ్రీనరీ శాఖ నిర్వాహకమే నిదర్శనం.

గత ప్రభుత్వంలో పనులు చకచకా..

రామచంద్రపురం పట్టణంలోని 1వ వార్డు కొత్తూరులో టిడ్కో గృహ నిర్మాణాలను గత ప్రభుత్వం వేగవంతం చేసింది. మొదటి విడతలో 998 మంది లబ్ధిదారులకు టిడ్కో ప్లాట్‌లను అందజేశారు. టిడ్కో గృహ సముదాయం వద్ద అన్ని రకాల సౌకర్యాలు కల్పించేలా మొదటి నుంచి గత ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా కమ్యూనిటీ హాల్స్, గ్రౌండ్స్, పార్కుల నిర్మాణాలకు ప్రత్యేక స్థలాలను కేటాయించింది. వీటిని అభివృద్ధి చేసే బాధ్యతలను ప్రభుత్వం అర్బన్ గ్రీనరీ శాఖకు అప్పగించారు. దీనిలో భాగంగా సుమారు రూ.50 లక్షలతో టిడ్కో ప్రదేశంలో మొక్కల పెంపకం, పార్కులు అభివృద్ధి చేయటంతో పాటుగా పిల్లలు, పెద్దలు ఆడుకునేందుకు వీలుగా జిమ్‌ను ఏర్పాటు చేయాల్సి ఉంది. దీని కోసం ఇప్పటికే జిమ్‌కు సంబంధించిన సామగ్రిని ఏడాది క్రితమే టిడ్కో గృహ సముదాయాల వద్ద ఉంచారు. అయితే ఏడాదిన్నర అవుతున్న వాటిని పటించుకునే నాథుడు లేకుండా పోయాడు.

పాడైపోతున్న జిమ్ సామగ్రి

పార్కుల్లో ఏర్పాటు చేసేందుకు పిల్లలు ఆడుకునే సామగ్రితో పాటుగా ఓపెన్ జిమ్ సామగ్రిని అర్బన్ గ్రీనరీ శాఖ ఆధ్వర్యంలో టిడ్కో గృహ సముదాయంలో దిగుమతి చేసి గృహాల వద్ద వేశారు. వీటిని పార్కులో అమర్చాల్సిన అవసరం ఉంది. స్థానికులు చాలా సార్లు మున్సిపాలిటీ అధికారులకు దీనిపై ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. ప్లాట్లను ఆనుకుని జిమ్, ఆడుకునే సామగ్రి వేయటంతో తుప్పలు పెరిగిపోయి వాటిలో విష సర్పాలు వచ్చి చేరుతున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. కాగా వాటిని అలాగే పాడేయటంతో రూ.లక్షల విలువ చేసే సామగ్రి పనికి రాకుండా పోతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పార్కుల్లో సామగ్రిని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. అర్బన్ గ్రీనరీ, టిడ్కో, పురపాలక శాఖలు సమన్వయంతో పని చేసి వాటిని వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

> **అందుబాటులోకి తెచ్చేందుకు యత్నం**
>
> 
>
> టిడ్కోలో ఉంచిన జిమ్ సామగ్రిని కాలనీ వాసులకు అందుబాటులోకి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తాం. అర్బన్ గ్రీనరీ, మున్సిపాలిటీ అధికారులను సమన్వయం చేసి వినియోగంలోనికి వచ్చే విధంగా చర్యలు తీసుకుంటాం.
>
> – గాధంశెట్టి శ్రీదేవి, మున్సిపల్ చైర్ పర్సన్, రామచంద్రంపురం

మద్యం షాపుల సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలి



గొల్లపాలెంలో ఆందోళన చేస్తున్న మద్యం షాపుల సిబ్బంది

కాజులూరు: ప్రభుత్వ మద్యం షాపుల్లో వివిధ హోదాల్లో పని చేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ అబ్కారి మద్యం షాపుల్లో పని చేస్తున్న సిబ్బంది ఆందోళన చేపట్టారు. ఆదివారం మధ్యాహ్నం భోజన విరామం సమయంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సిబ్బంది గొల్లపాలెం ప్రభుత్వ మద్యం షాపు వద్దకు చేరుకుని ప్లకార్డులతో నినాదాలు చేస్తూ ఆందోళనలు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మద్యం షాపుల నిర్వహణ బాధ్యతలు చేపట్టి ఔట్ సోర్సింగ్ విధానంలో పలువురిని సూపర్‌వైజర్లు, సెల్స్‌మెన్లగా నియమించిందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం మద్యం షాపులను ప్రైవేటు పరం చేయనున్నట్టు వార్తలొస్తున్నాయన్నారు. అదే జరిగితే రాష్ట్ర వ్యాప్తంగా మద్యం షాపుల్లో పని చేస్తున్న 18,000 మంది సూపర్‌వైజర్లు, సెల్స్ మెన్లు ఉపాధి కోల్పోతారన్నారు. ఔట్ సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న సూపర్‌వైజర్లు, సెల్స్ మెన్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

పీఠంలో ఘనంగా శ్రీరామ పాదుకా పట్టాభిషేకం



పీఠంలో నిర్వహిస్తున్న శ్రీనివాస కల్యాణం

రాయవరం: మండలంలోని వెదురుపాక విజయ దుర్గా పీఠంలో ఆధ్యాత్మికత వెల్లివిరుస్తోంది. పీఠం 52వ వార్షికోత్సవాల్లో భాగంగా ఆదివారం భద్రాచలం సీతారామచంద్రమూర్తి ఆలయ వేద పండితులచే పీఠంలో సీతారామచంద్రమూర్తికి సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సీతారామస్వామి దివ్య కల్యాణం, సహస్రనామ అర్చనల అనంతరం సామ్రాజ్య పట్టాభిషేకాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. పట్టాభిషేకంలో భాగంగా పాదుకా సమర్పణ, రాజముద్రిక, రాజదండకం, నందక, ఛత్ర చామర, ఆభరణాల సమర్పణ, నదీజలాలతో అభిషేకం, మంగళాశాసనం వంటి పూజాదికాలు నిర్వహించారు. పీఠాధిపతి వాడ్రేవు వెంకట సుబ్రహ్మణ్యం(గాడ్) భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ సీతారామ కల్యాణం, శ్రీరామ సామ్రాజ్య పట్టాభిషేకం విశిష్టతను భక్తులకు వివరించారు. వేడుకల్లో భాగంగా సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని వైఖానస ఆగమ విధానంలో నేత్రపర్వంగా నిర్వహించారు. తిరుపతికి చెందిన అర్చకుడు బాలాజీ, పలువురు వేదపండితులు అర్చకత్వంలో పీఠంలోని శ్రీదేవి, భూదేవి సమేత విజయ వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలకు వైఖానస ఆగమ విధానంలో శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. అర్చకస్వాములు శ్రీనివాసుని కల్యాణ విశిష్టతను భక్తులకు వివరించారు.

లోక కల్యాణం కోసమే..

లోక కల్యాణం కోసమే పీఠంలో కల్యాణాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు విజయ దుర్గా పీఠాధిపతి వాడ్రేవు వెంకట సుబ్రహ్మణ్యం (గాడ్) తెలిపారు. కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని తిలకిస్తే సకల శుభాలు కలుగుతాయన్నారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనతో మెలగాలని భక్తులకు ఉద్బోధించారు. పీఠంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పీఠానికి వచ్చిన భక్తులకు పీఠం ప్రతినిధుల ఆధ్వర్యంలో అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, విజయదుర్గా సేవా సమితి ప్రతినిధులు సత్యవెంకటకామేశ్వరి, భాస్కరనారాయణ దంపతులు, సత్యకనక దుర్గ, బి.రమ, పీఠం పీఆర్వో వాడ్రేవు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో విజయదుర్గా అమ్మవారు

ఉత్తమ సేవలకు పురస్కారం



జిల్లా పంచాయతీ అధికారి రాంబాబు నుంచి పురస్కారం అందుకుంటున్న సత్యనారాయణ

కె.గంగవరం: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని విధి నిర్వహణలో చేసిన అత్యుత్తమ సేవలకు గుర్తింపుగా మండలానికి చెందిన పలువురు ఉద్యోగులకు ఉత్తమ సేవా పురస్కారాలు అందుకున్నారు. దంగేరు పంచాయతీ కార్యదర్శి కేవీవీ సత్యనారాయణకు ఉత్తమ సేవా అవార్డు లభించింది. కాగా అమలాపురంలో శనివారం సాయంత్రం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో పంచాయితీరాజ్ శాఖ తరపున జిల్లా పంచాయతీ అధికారి డి.రాంబాబు చేతుల మీదుగా సత్యనారాయణ అవార్డును అందుకున్నారు. ఆయనతో పాటు కె.గంగవరం గ్రామ సచివాలయం డిజిటల్ అసిస్టెంట్ కె.సూరిబాబు, కోటిపల్లి గ్రామ పంచాయతీ స్వీపర్ పులిదిండి శేషారావు కూడా ఉత్తమ సేవా పురస్కారాలు అందుకున్నారు. అవార్డులు పొందిన వీరిని ఎంపీడీఓ ఎన్.శ్రీనివాసరావు, ఎంపీపీ పంపన నాగమణి, సర్పంచులు పెమ్మాడి బేబీసత్తిబాబు, కొప్పిశెట్టి రమణ తదితరులు అభినందించారు.

నిట్‌లో హారికకు బంగారు పతకం



స్నాతకోత్సవంలో బంగారు పతకం, సర్టిఫికెట్లు అందుకుంటున్న హారిక (ఇన్‌సెట్) బంగారు పతకంతో గుబ్బల హారిక

రామచంద్రపురం రూరల్: మండలంలోని తాళ్లపొలం గ్రామానికి చెందిన గుబ్బల హారిక తాడేపల్లిలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్)లో సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో 2020–24 బ్యాచ్‌లో టాపర్‌గా నిలిచి బంగారు పతకం సాధించింది. ఈ మేరకు ఈ నెల 17న నిర్వహించిన నిట్ 6వ స్నాతకోత్సవంలో ఆమెకు బంగారు పతకం, సర్టిఫికెట్లను అందజేశారు. హారిక తండ్రి శ్రీనివాసరావు ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా, తల్లి ఎన్ఆర్ఈజీఎస్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. హారికను రామచంద్రపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్, జెడ్పీటీసీ మేర్నీడ వెంకటేశ్వరరావు, ఎంపీపీ అంబటి భవాని, వైస్ ఎంపీపీలు నరాల రాజ్యలక్ష్మి, శాకా బాబీ, ఎంపీటీసీ పంపన ఏడుకొండలు, సర్పంచ్ కట్టా గోవిందు, ఉప సర్పంచ్ వల్లు శివ తదితరులు అభినందించారు.

తపాలా ఉద్యోగికి వీడ్కోలు సన్మానం



పోస్ట్‌మన్ సత్యనారాయణను సత్కరిస్తున్న ఉద్యోగులు

మండపేట: పోస్టుమన్‌గా తాపేశ్వరం గ్రామానికి పినిపే సత్యనారాయణ అందించిన సేవలు చిరస్మరణీయమని మండల విద్యాశాఖాధికారి నాయుడు రామచంద్రరావు అన్నారు. తాపేశ్వరం గ్రామంలో 42 సంవత్సరాల పాటు పోస్టుమన్‌గా పని చేసిన సత్యనారాయణ ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆదివారం తాపేశ్వరంలో తపాలా ఉద్యోగులంతా ఆయనను ఘనంగా సత్కరించారు. సత్కార సభకు ఎంఈవో రామచంద్రరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో సబ్ పోస్ట్‌మాస్టర్ జగన్నాథరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సభలో ఎంఈవో మాట్లాడారు. సుదీర్ఘకాలం పనిచేసి గ్రామ ప్రజలు మన్ననలు పొందిన సత్యానారాయణ సేవలు అభినందనీయమన్నారు. కొత్తపేట హెడ్ పోస్ట్ మాస్టర్ కె.విఠల్‌నాథ్ మాట్లాడుతూ తాను ఇదే పాఠశాలలో చదివి హెడ్ పోస్ట్‌మాస్టర్ స్థాయికి ఎదిగానన్నారు. అనంతరం సత్యనారాయణను దుశ్శాలువాలు, పూల మాలలతో ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఎంఈవో సోమిరెడ్డి, తపాలా ఉద్యోగులు కేవీ నారాయణ, కొండపల్లి సూర్యనారాయణ, జీవీ రమణమూర్తి, వై.కామేశ్వరి, ఎం.సూర్యనారాయణ, గంధ్రోతు రామకృష్ణ, బి. వీరయ్యచౌదరి, పిల్లా నాగేశ్వరరావు, పి. అబ్బిరాజు, రిటైర్డ్ పోస్ట్‌మాస్టర్ టి. పుల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో రక్షాబంధన్ సందడి



ద్రాక్షారామలో రాఖీలు కొనుగోలు చేస్తున్న మహిళలు

రామచంద్రపురం రూరల్: గ్రామాల్లో రక్షాబంధన్ సందడి నెలకొంది. ఆదివారం రాత్రి వరకూ ప్రత్యేక స్టాల్స్‌లో రాఖీల కొనుగోళ్ల సందడి నెలకొంది. మండలంలోని ద్రాక్షారామతో పాటు పరిసర గ్రామాల్లోనూ రాఖీల అమ్మకాల నిమిత్తం ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేసి అమ్మకాలు జరిపారు. తమ సోదరులకు రాఖీలు కట్టే నిమిత్తం మహిళలు, యువతులు, బాలికలు ఈ స్టాల్స్‌తో పాటు బుక్స్ స్టాల్స్, కిరాణా షాపుల్లోను కొనుగోళ్లు చేశారు. రాఖీల దుఖాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి.

ఊబలంకలో హనుమాన్ చాలీసా పోటీలు



ఊబలంకలో హనుమాన్ చాలీసా పఠన పోటీల్లో బహుమతులు గెలుచుకున్న విద్యార్థులు

రావులపాలెం: మండలంలోని ఊబలంకలోని హనుమత్ లక్ష్మణ సీతా సమేత కోదండరామ స్వామి ఆలయంలో ఆదివారం హనుమాన్ చాలీసా పోటీలు నిర్వహించారు. రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని 15 సంవత్సరాల లోపు బాల బాలికలకు ఈ పోటీలు నిర్వహించారు. గ్రామంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొని హనుమాన్ చాలీసా పఠనం చేశారు. ఈ పోటీల్లో ప్రథమ స్థానంలో ఎస్. విద్యాసాయి, ద్వితీయ స్థానంలో కె.కావ్య వెంకటశ్రీ, తృతీయ స్థానంలో జి.సాత్విక్ నిలిచారు. వారికి వరుసగా రూ. 2 వేలు, రూ.వెయ్యి, రూ.500 చొప్పున నగదు బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలను ఆలయ కార్య నిర్వహణాధికారి చింతా ప్రభాకర్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు హనుమాన్ చాలీసా పఠనంపై శిక్షణ ఇచ్చిన ఆలయ అర్చకుడు గుంటూరు వెంకట శివరామకృష్ణ శర్మను అభినందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గోదారికి గుండె కోత

- నదీ గర్భంలో కలిసిపోతున్న సారవంతమైన భూములు
- గ్రోయిన్లు, రివిట్‌మెంట్ నిర్మించాలని వేడుకుంటున్న రైతులు



పాశర్లపూడిలో నదిలోకి ఒరిగిన కొబ్బరి చెట్లు

మామిడికుదురు: గోదావరి నదీ కోత రైతులకు గుండె కోతను మిగులుస్తోంది. వైనతేయ గోదావరి నదీ తీరంలో గోదావరి కోత తీర గ్రామాల ప్రజలను కలవరపెడుతోంది. ఏటా వరదల సమయంలో ఎంతో సారవంతమైన భూములు గోదావరి నదీగర్భంలో కలిసిపోతున్నాయి. గత నెలలో వచ్చిన గోదావరి వరదకు తీరంలో కోత తీవ్రమైంది. వందలాది కొబ్బరి చెట్లు నదీగర్భంలో కలిసిపోయాయి. కోత నివారణకు గ్రోయిన్లు, రివిట్‌మెంట్ నిర్మించాలని రైతులు వేడుకుంటున్నా ఫలితం మాత్రం శూన్యం. గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో మాత్రమే కోత నివారణ చర్యలు చేపట్టారు. తర్వాత వాటి వైపు కన్నెత్తి కూడా చూడలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఐదు గ్రామాల్లో పరిస్థితి తీవ్రం

వైనతేయ గోదావరి నదీ తీరంలోని కుడి వైపు పెదపట్నం, అప్పనపల్లి, పెదపట్నంలంక, బి.దొడ్డవరం, పాశర్లపూడి, ఆదుర్రు గ్రామాల్లో గోదావరి కోత తీవ్రంగా ఉంది. అప్పనపల్లిలో కోత నివాస గృహాలను సమీపించింది. దీంతో స్థానికులు కలత చెందుతున్నారు. మిగిలిన గ్రామాల్లో కొబ్బరి తోటలు కోతకు గురై నదిలో కూలిపోతున్నాయి. ఒడ్డు అండలుగా నదిలో విరిగి పడుతోంది. గతంలో నిర్మించిన గ్రోయిన్లు గోదావరి వరద నీటి ప్రవాహానికి కొట్టుకుపోతున్నాయి. రివిట్‌మెంట్ నదిలో దిగబడిపోతుంది. రోజురోజుకూ కోత మరింత తీవ్రమవుతుంది. కోత నివారణకు ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకోవాలని తీర గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

13 కుంచాల భూమి పోయింది



మా కుటుంబానికి చెందిన 13 కుంచాల భూమి గోదావరి నదిలో కలిసిపోయింది. ఇంకా అయిదు కుంచాలు మాత్రమే మిగిలింది. గోదావరి కోత వల్ల తీవ్రంగా నష్టపోయాం. గతంలో ఎంతో మందికి విన్నపాలు చేసినా ఫలితం శూన్యం. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి. నదీ కోత నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– పాబోలు భీమశంకరం, రైతు, బి.దొడ్డవరం

రివిట్‌మెంట్ నిర్మించాలి



గోదావరి నదీకోత తీరంలోని భూములను కబలిస్తోంది. కోతతో చిన్న, సన్నకారు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కోత నివారణకు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడం తప్ప ఆ దిశగా తీసుకుంటున్న చర్యలు శూన్యం. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం స్పందించాలి. రైతులను ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలి. కోత నివారణకు గ్రోయిన్లు, రివిట్‌మెంట్ నిర్మించాలి.

– ఉప్పే ప్రదీప్, రైతు, పాశర్లపూడి

రెండెకరాలకు పైగా కోల్పోయాం



పెదపట్నంలంక గ్రామంలో గోదావరి కోత తీవ్రంగా ఉంది. కోత నివారణకు గతంలో నిర్మించిన గ్రోయిన్లు, రివిట్ మెంట్ సైతం కొట్టుకుపోతున్నాయి. కోత నివారణకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలి. కోత కారణంగా మేము రెండెకరాలకు పైగా కోల్పోయి తీవ్రంగా నష్టపోయాం. కోత నివారణ చర్యలు చేపట్టి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

– జోగి అర్జునరావు, రైతు, పెదపట్నంలంక

ప్రతిపాదనలు పంపించాం

వైనతేయ గోదావరి నదీతీరంలో అప్పనపల్లి, పెదపట్నంలంక, బి.దొడ్డవరం, పాశర్లపూడి, ఆదుర్రు గ్రామాల్లో గోదావరి కోత ఎక్కువగా ఉన్నట్లు గుర్తించాం. కోత నివారణకు రివిట్‌మెంట్, గ్రోయిన్లు నిర్మించడానికి సుమారు రూ.82 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేస్తున్నాం. ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించాం. నిధులు మంజూరు కాగానే పనులు చేపడతాం.

– టీవీఎల్ఎస్ మూర్తి, హెడ్ వర్క్స్ ఏఈఈ, రాజోలు

175 మందికి కంటి వైద్య పరీక్షలు



నెలపర్తిపాడులో కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

రామచంద్రపురం రూరల్: మండలంలోని నెలపర్తిపాడులో ఆదివారం కాకినాడ కిరణ్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామానికి చెందిన దివంగత వల్లూరి కామేశ్వరరావు జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో కంటి వైద్య నిపుణులు పి.సత్యనారాయణ, మాధవి 175 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి ఆపరేషన్లు అవసరమైన 18 మందిని, కళ్లజోడు అవసరమైన 28 మందిని గుర్తించారు. వీరికి ఉచితంగా ఆపరేషన్లు చేయించేందుకు, కళ్లజోళ్లు అందించేందుకు ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు వల్లూరి వీర వెంకటసూర్యనారాయణచౌదరి, రాయుడు వీర్రాజు, వల్లూరి సురేష్‌బాబు తెలిపారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో చిట్టూరి సత్యనారాయణ, తాతపూడి కుమార్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

మాచర భూములను సబ్ డివిజన్ చేయాలి

కపిలేశ్వరపురం: మాచర గ్రామ పరిధిలోని భూములను సబ్ డివిజన్ చేయాలని పీఏసీఎస్ మాజీ చైర్మన్ కరెడ్ల శ్రీనివాస్‌బాబు ఆదివారం కోరారు. భూములు సబ్ డివిజన్ కాకపోవడంతో రిజిస్ట్రేషన్లు కావడం లేదని, రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. సాంకేతిక సమస్యలను పరిష్కరించి త్వరితగతిన రిజిస్ట్రేషన్లు అయ్యేలా చర్యలు తీసుకోవాలని శ్రీనివాస్ కోరారు.